దారపురెడ్డి కనకమహాలక్ష్మి
తెలుగు అధ్యాపకురాలు
శ్రీమతి వెలగపూడి దుర్గాంబ
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల
నిడదవోలు.
చరవాణి : 9959327185
kanaka84maha@gmail.com

# పాపాఘ్ని కథలు – రాయలసీమ సామాజిక స్థితిగతులు

మానవ సమాజంలో కొన్ని విలువలు అనేవి ఉంటాయి. వాటిని ఆధారంగా చేసుకునే సాహిత్యం ఉద్భవిస్తుంది. కానీ మారుతున్న సమాజంలో ప్రపంచీకరణ నేపథ్యంలో నైతిక విలువలు, మానవత్వపు విలువలు దిగజారిపోయి ఆ స్థానంలో ధనం ఎవరి దగ్గర ఉంటే వారు చేసే పనులే విధిగా వారు పాటించేవే నియమాలుగా స్థిరపడి పోతున్నాయి ఈ రోజుల్లో.

నేటి కాలంలో దిగజారిపోతున్న మానవీయ విలువలను మనకు గుర్తు చేసి ఆ మానవీయ విలువలను నిలబెట్టాలన్న తాపత్రయంతో అందరికీ అర్థమయ్యే సరళమైన భాషలో, కాలం చాలా విలువైనది అని చెప్పుకునే ఈ రోజులలో పెద్ద కథలు కూడా చదవడం కష్టం కాబట్టి, చక్కని భావంతో అందరికీ అర్థమయ్యే రీతిలో చిన్న చిన్న కథల రూపంలో మనలో ఉన్న మానవత్వాన్ని తట్టిలేపేలా డా॥ వేంపల్లి గంగాధర్ కథలు మనకు కనిపిస్తాయి.

డా॥ వేంపల్లి గంగాధర్ సాహిత్య అకాడమీ యువ పురస్కారం అందుకున్న తొలి తెలుగు రచయిత. కవి, కథకుడు, పరిశోధకుడు. ఈయన 1999లో ఆం.ప్ర.ప్ర.సాంస్కృతిక సమాఖ్య సాహిత్య విమర్శ పురస్కారం, 2001లో ఆం.ప్ర.ప్ర. సాంస్కృతిక సమాఖ్య మీడియా రైటింగ్ పురస్కారాలను కూడా అందుకున్నారు. ఈయన 'రావణ వాహనం కథలు', 'పాపాఘ్ని కథలు', 'దేవరశిల', 'గ్రీష్మభూమి' వంటి కథలు, మొదలగు సంపుటాలు వీరి లేఖిని నుండి వెలువడ్డాయి. ఈయనే "నేల దిగిన వాన" అనే నవలను, ఇంకా అనేక కవితలు, వ్యాసాలు రాసారు.

ఆయన రాసిన పాపాఘ్ని కథలలో 'రాయలసీమ వాసుల యదార్థ జీవిత గమనం తెలియవస్తుంది. తద్వారా మానవ విలువలు ఏ స్థాయిలో ఉన్నాయో గోచరవుతూ, మనలో వున్న మానవత్వాన్ని తట్టిలేపుతూ ఉంటాయి. వాటిలో కొన్నిటిని నేను ఉదహరిస్తున్నాను.

### ఊరి దెయ్యాలు

ఊరిదెయ్యాలు అనే కథలో రామాపురం గ్రామంలో సమారు 80 కుటుంబాలు నివసిస్తూంటాయి. ఆ ఊరి సర్పంచు పథకం ప్రకారం మంత్రగాడు కూర్మయ్యతో కలసి ఊరి జనాన్ని ఆ గ్రామం నుండి అందరూ వెళ్లిపోయేలా చేయాలనుకుంటాడు.

బేల్దారి పనిచేసే నాగన్న పని చేస్తూ చనిపోవడం, మునెమ్మ ఉరిపోసుకోవడం, మద్దిరేవు వెంకటయ్య కల్తీ సారాయి తాగి చనిపోవడం ఈ సంఘటనలు సహజంగా జరిగినవే అయినా ఒకే నెలలో ముగ్గురు చనిపోయారనీ, ఊరిలో దెయ్యాలు తిరుగుతున్నాయని పుకారు లేవదీస్తారు.

మరో రెండు రోజులకు అంకన్న పాము కరిచి చనిపోవడంతో ఊరికేదో పోయేకాలం వచ్చిందని, అందరూ ఖాళీ చేయాలనుకుని, మరోసారి మంత్రగాడు కూర్మయ్యను పిలిచి ప్రశ్న చెప్పించుకోగా, సర్పంచ్, కూర్మయ్య అంతకు ముందే నిర్ణయించుకున్న ప్రకారం ఊర్లో దెయ్యాలు వుండేది నిజమే అని చెప్పాడు.

వెంకటేశు, చెన్నమ్మ కూడా నిజమే, ఆ సర్పంచయ్య ముందే చెప్పారు కానీ మనమే వినలేదు అనుకుంటారు. భయంతో రాత్రికి రాత్రే ఊరు ఖాళీ చేసి చీకీ చెట్ల వనంలో తలదాచుకుంటారు. చూస్తూ వుండగానే పచ్చని ఊరు తెగులుకొట్టిన దానిలాగా అయిపోయింది.

కానీ పరిస్థితి అక్కడితో అవ్వలేదు. బద్వేలుకు 5కి.మీ. దూరంలోని బాటకాడపల్లెకు దెయ్యాలు వచ్చాయని అలజడి రేగింది.

జక్కిరయ్య ట్రాక్టరు సన్యాసోళ్ల సత్రం చింతచెట్టు కిందకు వచ్చే సరికి టైరు పంక్చరవడంతో అతను అలా జరగడానికి దెయ్యాలే కారణమని అనుకోవడం, బడిపిల్లలు కాలువలో పడి చనిపోవడం కూడా అందుకే అంటూ ఊరిలో పెద్దమనిషిగా చలామణి అయ్యే నాయుడు అనటంతో జక్కిరయ్య నిజమేనంటాడు.

పది, పదిహేను ఇళ్లలో జ్వరాలతో ముసలివాళ్ళు మంచాన పడటం, శాంతిచేస్తే ఊరి పొలిమేర్లలో బలి ఇస్తే దెయ్యాలు ఊర్లోకి రావని మస్తాను చెప్పగా అలాగే చేస్తారు. ముసలి కొండయ్య గుండెపోటుతో మరణించగానే మళ్లీ కథ మొదటి కొచ్చి, పంచాయితీలో 50 కుటుంబాల వాళ్ళుకూడా ఊరు విడిచి పోవాలని నిర్ణయించుకుంటారు.

టౌను వైపు వుండే ఖాళీస్థలం కోసం అధికారుల దగ్గరకు తిరగగా వాళ్ళు వీరిని హేళన చేస్తూ, స్థలం కోసం ఇలా నాటకాలు ఆడుతున్నారని అంటారు. చివరికి వారు తిమ్మమ్మ కొండ మీద గుడిసెలు వేసుకోవటానికి వెళ్ళటంతో ఆ ఊరు కూడా ఖాళీ అయిపోతుంది.

దెయ్యాల పేరుతో రామాపురం, బాటకాడపల్లె రెండు గ్రామాలనూ సర్పంచయ్య, నాయుడు, స్నేహితుడు రెడ్డయ్యలు కైవసం చేసుకుని అక్కడ కంకరుమిషను, కెమికల్ ఫ్యాక్టరీలు పెట్టడం మరో గ్రామానికి కూడా దెయ్యాలు రావటం, భైరవపల్లె ప్రజలుకూడా ఊరు విడిచి పెట్టాలనుకోవడం, ఇదంతా ప్రపంచీకరణ మనుషులను ఏవిధంగా శాసిస్తున్నదీ, పెద్ద మనుషుల పేరుతో చలామణి అయ్యే వారు తమ స్వంత ప్రయోజనాల కోసం అమాయకులైన ప్రజల మూఢనమ్మకాలను ఆసరాగా చేసుకుని, వారిని ఏవిధంగా మోసగిస్తున్నారో ఈకథలో మనకు రచయిత కళ్ళకు కట్టనట్లు చూపించారు.

### ఇసుక

ఈ కథలో పాపాఘ్ని నదిలోని ఇసుకను అక్రమంగా త్రవ్వి నదీ ప్రవాహాన్ని అడ్డుకోవడం గురించి రచయిత వివరించాడు. నడిరాత్రి పెట్రోమార్సు లైటు వెలుగులో ప్రొక్లెయినరు సాయంతో పాపాఘ్ని నదిలోని ఇసుకను నిరంతరం ట్రాక్టర్లలో నింపి తరలించేవారు. సాంబడు త్రవ్వేచోట రక్...రక్ మనే శబ్దం రావడంతో ఆప్రక్క ఇసుక అయిపోయింది గానీ సమాధుల దిక్కు త్రవ్వు అని ట్రిప్పుల లెక్క రాసుకునే కొండ్రెడ్డి చెపుతాడు.

ట్రిప్పుకు ఎనిమిదొందల లెక్కన నాలుగువందల ట్రిప్పులకు మూడు లక్షలు రామిరెడ్డి ఖాతాలో పడ్డట్లే అని అంటాడు కొండ్రెడ్డి. ఆ ప్రక్క సమాధులు తవ్వుతూంటే భయమేస్తుందని సాంబడు అంటే, బతికున్న వాళ్ళకే మనం భయపడం, ఇక చచ్చిపోయిన శవాలకు ఎందుకు భయపడటం అంటాడు కొండ్రెడ్డి.

ఆ డబ్బంతా రామిరెడ్డికేనా? అని సాంబడు అడగ్గా, పాట్నర్ నాయుడు కూడా కలిసి వ్యాపారం చేస్తున్నారు కదా అని, ఇంకా రూపాయి వాటా ఈ ఊరి సర్పంచ్‌కు, ఒక భాగం అధికారులకు, పోలీసోళ్ళకు ఇస్తారు. ఇంకా ట్రాక్టర్ల బాడుగలు, కూలోళ్ళు .... వద్దురా నాయనా ... అని కొండ్రెడ్డి అనగా, మరి అంత నష్టం వస్తే ఈ వ్యాపారం చేయడమెందుకు అంటాడు సాంబడు.

సర్లేగాని ఈ ఇసుకంతా ఎక్కడికి పోతుందని సాంబడు అడగ్గా ప్రాజెక్టులు, ఇందిరమ్మ ఇండ్లు, టౌన్లో అయితే రియలెస్టేట్ వ్యాపారమే జరుగుతూవుంది అని రహస్యాలను బట్టబయలు చేస్తాడు కొండ్రెడ్డి.

సాంబడు షిఫ్ట్ దిగి ఇంటికెళ్ళి స్నానం చేద్దామని అరగంట బోరింగు కొడితే చెంబుడు నీళ్లు మాత్రమే వచ్చేసరికి, ఏందేయిది? అని భార్యను గసురుకుంటాడు.

బోర్లలో నీళ్ళెక్కడున్నాయి? యేర్లే ఎండిపోతున్నాయి. ఇక బోర్లులో పరిస్థితేంటి? తాగడానికి ఇంట్లో కూడా నీళ్ళు లేవు. ఏం చేసేది? అని బోరింగును కొడుతూనే అంటుంది అతని భార్య.

సరే రెడ్డోరి బావి దగ్గరకెళ్లి తీసుకురా అంటే, అక్కడా నీళ్ళు లేవు అంటే ఇది వూరా.. కాదా... అంటాడు సాంబడు కోపంగా... యేరుకి ఆనుకునే వూరున్నాది. యేట్లో ఇసకంతా తవ్వి, అమ్ముకుంటూ పోతుంటే, ఇక భూమిలో నీళ్లెట్లా ఇంకుతాయి? అని, ఇంకా ఇసుక దొంగలని వూర్లో అందరూ తిడుతున్నారు, నువ్వు మాత్రం ఆ పనికి వెళ్ళకు అని కన్నీళ్లు పెట్టుకుంటుంది అతని భార్య.

సాంబడికి మంచినీళ్ళు అడగాలన్నా భయమేస్తోంది. "మనవూరి యేరును మనమే బతికించుకోవాలి" అంటూ గట్టిగా ఆయమ్మి ఏదో చెప్తానేవుంది.

ఈ కథలో రామిరెడ్డి, కొండ్రెడ్డి వంటి వాళ్లు ఏవిధంగా ఇసుక దందాను నడుపుతున్నారో, సాంబడు లాంటి వాళ్లు కూలి కోసం పనిచేస్తూ వుండటం, చివరకు ఊరివాళ్ళు అసలు దోపిడీ దార్లను ఏమీ అనలేక, కూలి చేసుకునే సాంబడులాంటి వాళ్ళను ఆడిపోసుకోవడం, కళ్లెదుట పరిస్థితులను తెలియజేస్తుంది.

ఈవిధంగా ఇసుక దోపిడీ చేయడం వలన ప్రకృతిలో అసమతుల్యతలేర్పడి నదులు కూడా ఎండిపోయే పరిస్థితులు వస్తున్నాయని రచయిత ఈ కథ ద్వారా తన ఆవేదనను వ్యక్తం చేసాడు.

ఈ విధంగా వేంపల్లి గంగాధర్ గారు రాసిన పాపాఘ్ని కథలలో నాణ్యతలేని విత్తనాలు, ఎరువులు దక్కని రైతుల గోడు, ప్రాజెక్టుల కింద పునరావాసం లభించని రైతుల వ్యథలు, త్రాగటానికి కూడా నీరు లభించని దుస్థితి, గొర్రెలను తీసుకుని దేశాటనం చేయడం, ప్రభుత్వ పథకాల లోగుట్టులు ఇటువంటివన్నీ ఈ కథలలో చిత్రించాడు. ఈ కథలలోని ప్రతీది మనకు రాయలసీమలోని సామాజిక పరిస్థితులు, జీవన స్థితిగతులను మన కళ్లెదుట సాక్షాత్కరింపజేస్తూ మనలో ఒక విధమైన భావోద్వేగాన్ని కలిగిస్తాయి.

ఆధార గ్రంథములు:
వేంపల్లి గంగాధర్ – పాపాఘ్ని కథలు